క్లుప్తంగా

తహసీల్దార్ కార్యాలయంలో చలివేంద్రం



తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు

పెద్దేముల్: తహసీల్దార్ కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చివెళ్లే వారికి నీటి వసతి కల్పించాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు డిప్యూటీ తహసీల్దార్ మహేశ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజిరెడ్డిలు కొత్త కుండలు ఏర్పాటు చేసి తాగునీటి వసతి కల్పించారు. వారం రోజులుగా ఎండ తీవ్రత పెరగడంతో కార్యాలయానికి వచ్చివెళ్లే వారితో పాటు బాటసారులకు చల్లని తాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసినట్లు కార్యాలయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ అవినాష్, కంప్యూటర్ ఆపరేటర్లు బసంతు రెడ్డి, ముస్తాఫ, వీఆర్ఏలు రవి, ఆశప్ప, అంజిలప్ప, శ్రీను, హరీశ్, రాము తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ సబ్‌సెంటర్ భవన నిర్మాణానికి భూమి పూజ



భూమిపూజ చేస్తున్న సర్పంచ్ శ్రీనివాస్ తదితరులు

యాలాల: హాజీపూర్ గ్రామానికి హెల్త్ సబ్‌సెంటర్ మంజూరు చేయించిన ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి సర్పంచ్ ఒంగోనిబాయి శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం భవన నిర్మాణ పనులకు ఆయన పూజ చేసి మాట్లాడారు. గ్రామానికి నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్‌ఎం) నుంచి రూ.20 లక్షలు మంజూరయ్యాయని, ఈ మేరకు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టామన్నారు. వీలైనంత త్వరగా హెల్త్ సెంటర్‌ను వినియోగంలోకి తెచ్చేలా కృషి చేస్తామని సర్పంచ్ చెప్పారు. కార్యక్రమంలో గ్రామస్తులు రాజేందర్, మల్లేశం, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు జర జాగ్రత్త

కొడంగల్: ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించి సురక్షిత ప్రయాణం చేయాలని, అలాగే పెద్ద వాహనదారులు సీటు బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని ఎస్‌ఐ రవిగౌడ్ చెప్పారు. ఈ మేరకు ఆయన బుధవారం మాట్లాడుతూ జాతీయ రహదారిపై ప్రమాదాలు పెరుగుతున్నాయని, హెల్మెట్ లేకుండా, అజాగ్రత్త, అతి వేగంతో వాహనాలు నడుపుతూ ప్రమాదాల బారిన పడి, ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని వెల్లడించారు. వాహనం నడిపించేటప్పుడు జాగ్రత్తగా ఉంటూ.. అన్ని వైపులను గమనిస్తూ పయనించాలని సూచించారు. అంతే కాకుండా బండికి సంబంధించిన పత్రాలు దగ్గరే ఉంచుకోవాలని, ప్రభుత్వ నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.


నేడు కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ధారూరు: ధారూరు మండల పరిధి గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ ఆనంద్ ప్రారంభించనున్నట్లు బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజునాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో నాగసమందర్ రైతు వేదికలో, గట్టెపల్లి హరిదాస్‌పల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో, ధారూరు మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ధారూరులో, ధారూరు పీఏసీఎస్ ఆధ్వర్యంలో గురుదోట్ల, నాగారంలో కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించనున్నారని ఆయన ప్రకటించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

కొడంగల్ రూరల్: చిన్ననందిగామలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ సావిత్రమ్మ, బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం పరిశీలించి మాట్లాడారు. రైతులకు ఇబ్బంది కలగకుండా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని సూచించారు. దళారులను ఆశ్రయించకుండా రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే తమ ధాన్యాన్ని విక్రయించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అనుమతులు తప్పనిసరి



నోటీసు అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి

కుల్కచర్ల: ఇంటి నిర్మాణానికి అనుమతులు తప్పనిసరని, పర్మిషన్ లేకుండా నిర్మాణం చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టిన పలువురికి నోటీసులు అందజేశారు.

బీఆర్‌ఎస్ హయాంలో క్రీడలకు గుర్తింపు

- చదువుతో పాటు ఆటలపై శ్రద్ధ చూపాలి
- సత్తాచాటిన క్రీడాకారులకు ఉద్యోగ అవకాశాలు
- సీఎం కప్–2023 ముగింపు కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు



పరిగి: క్రీడాకారులతో ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో క్రీడలకు, క్రీడాకారులకు ప్రత్యేక గుర్తింపు లభించిందని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. సీఎం కప్–2023 మండల స్థాయి క్రీడాపోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామీణ క్రీడాకారులకు అన్ని రకాల వసతులతో పాటు మూడు రోజులుగా మండల స్థాయి క్రీడలు ప్రభుత్వం నిర్వహించిందన్నారు. ఇందులో గెలుపొందిన వారికి జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడలు నిర్వహించి, ప్రతిభ చూపిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించనుందని వెల్లడించారు. కావున విద్యార్థులు, యువతీయువకులు చదువుతో పాటు ఆటలపై శ్రద్ధ చూపాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ అరవింద్‌రావు, జెడ్పీటీసీ హరిప్రియ, పీఏసీఎస్ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ భాస్కర్, మండల విద్యాధికారి హరిశ్చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

గెలుపోటములు సహజం

అనంతగిరి: ఆటల్లో గెలుపోటములను సమానంగా తీసుకోవాలని ఎంపీపీ చంద్రకళ అన్నారు. సీఎం కప్‌లో భాగంగా మండల స్థాయిలో నిర్వహించిన పోటీలు ముగిశాయి. మూడు రోజులుగా జరిగిన క్రీడోత్సవాల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన జట్లకు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సత్తయ్య, ఎంపీఓ నాగరాజు, ఏపీఓ శీను, పీడీలు రాజేందర్, ప్రతాప్‌రెడ్డి పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

20న బహుమతుల ప్రదానం

కొడంగల్ రూరల్: సీఎం కప్–2023 టోర్నీలో గెలుపొందిన జట్లకు ఈ నెల 20వ తేదీన బహుమతులు ప్రదానం చేయనున్నట్లు ఎంపీడీఓ పాండు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాలీబాల్‌లో 8 జట్లు, కబడ్డీలో 6టీంలు, వంద మీటర్ల పరుగు పందెంలో 12మంది క్రీడాకారులు, 4 వందల మీటర్లలో 6గురు పాల్గొన్నారని తెలిపారు. ఇందులో వాలీబాల్, కబడ్డీలో హస్నాబాద్ జట్లు విజయం సాధించాయని, వంద మీటర్ల పరుగు పందెంలో కొడంగల్‌కు చెందిన మనోజ్, 4వందల మీటర్లలో కొడంగల్ వాసి కిరణ్ విజేతగా నిలిచారని తెలిపారు. విజేతలకు శనివారం మండల పరిషత్ కార్యాలయంలో బహుమతులు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

కనీస వసతులు నిల్..

పెద్దేముల్: మూడు రోజుల పాటు పెద్దేముల్ మండల కేంద్రంలో జరిగిన సీఎం కప్ క్రీడోత్సవాలను మండల అధికారులు మమ అనిపించారు. కనీస వసతులు కల్పించక క్రీడాకారులను ఇబ్బందులకు గురిచేశారు. అయినప్పటికీ ఆటగాళ్లు ఆటలు ఆడారు. క్రీడా సామగ్రి లేక ఉన్నత పాఠశాలల నుంచి తీసుకొచ్చిన వాటితో వాలీబాల్ టోర్నీ నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో పలువురు క్రీడాకారులు మాట్లాడుతూ.. టోర్నీలో కనీస వసతులు కల్పించలేదంటూ అధికారులపై అసహనం వ్యక్తంచేశారు. ఇదిలా ఉండగా.. రన్నర్, విన్నర్లకు ఎంపీపీ అనురాధ జ్ఞాపికలు అందజేశారు. డిప్యూటీ తహసీల్దార్ మహేశ్, ఎంపీడీఓ లక్ష్మప్ప, ఎంపీఓ షేక్‌సుస్మా, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజిరెడ్డి, పీఈటీ రాధాకృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయుడు రాజశేఖర్, గోపిక, ప్రమోద్, ప్రశాంత్ పాల్గొన్నారు.

విజేతలు వీరే..

మూడు రోజులుగా నిర్వహించిన టోర్నీలో ఖోఖోలో విన్నర్‌గా, రన్నర్‌గా పెద్దేముల్ నిలవగా.. వాలీబాల్‌లో విన్నర్, రన్నర్‌గా మంబాపూర్ నిలిచింది. కబడ్డీలో విన్నర్‌గా కందనెల్లి, రన్నర్‌గా పెద్దేముల్ కాగా.. 100, 400 మీటర్ల పురుషుల విభాగంలో ప్రథమ స్థానంలో బుద్ధార లక్ష్మప్ప, ద్వితీయంలో రాము పెద్దేముల్, తృతీయ స్థానంలో జమీల్ నిలిచారు. 100 మీటర్ల మహిళల విభాగంలో రోహిత పెద్దేముల్ గెలుపొందారు.

క్రీడలపై ప్రత్యేక శ్రద్ధ

పూడూరు: తెలంగాణ ప్రభుత్వం విద్యతో పాటు క్రీడలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. టోర్నీ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై మక్కువ చూపాలని సూచించారు. అనంతరం గెలుపొందిన జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లేశం, జెడ్పీటీసీ మేఘమాల, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అజారుద్దీన్, సర్పంచ్ నవ్య, ఉప సర్పంచ్ రాజేందర్, పీఏసీఎస్ డైరెక్టర్ నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

బంట్వారం: గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని ఎంపీపీ ప్రభాకర్ అన్నారు. సీఎం కప్–2023లో భాగంగా మూడు రోజుల పాటు నిర్వహించిన క్రీడోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని విజేత జట్లకు జ్ఞాపికలు అందజేశారు. ఎంపీడీఓ బాలయ్య, మాజీ ఎంపీపీ రాములు యాదవ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ సుధాకర్ గౌడ్, యాచారం సర్పంచ్ బల్వంత్‌రెడ్డి, రెడ్డి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శరణారెడ్డి, కురుమ సంఘం నియోజక వర్గం అధ్యక్షుడు శ్రీనివాస్, ఎంపీఓ విజయ్‌కుమార్, ఎంఈఓ చంద్రప్ప పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో ఆడిస్తాం

దోమ: క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయని ఎంపీపీ అనసూయ అన్నారు. జిల్లా పరిషత్ పాఠశాలలో సీఎం కప్ ముగింపు క్రీడోత్సవాల్లో విజేతలకు వైస్ ఎంపీపీ మల్లేశం, ఎంపీడీఓ జయరాంతో కలిసి బహుమతులు ప్రదానం చేసి మాట్లాడారు. మండల స్థాయిలో గెలుపొందిన వారిని జిల్లా స్థాయిలో ఆడించి రాష్ట్ర స్థాయికి పంపించేలా కృషి చేస్తామని చెప్పారు. మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజిరెడ్డి, సీఆర్‌పీ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

దౌల్తాబాద్‌లో..

దౌల్తాబాద్: క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడం కోసమే సీఎం కప్ ఆటల పోటీలని ఎంపీపీ విజయ్‌కుమార్ తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో టోర్నీ ప్రారంభించి మాట్లాడారు. ఈ ఆటల పోటీలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తిరుమలస్వామి, తహసీల్దారు కృష్ణయ్య, హెచ్‌ఎం ఊషన్న, వైస్‌ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, ఎంపీఓ రవీందర్, సర్పంచ్ శిరీష పాల్గొన్నారు.



దోమ: ప్రశంసా పత్రం అందజేస్తున్న ఎంపీపీ అనసూయ తదితరులు



బంట్వారం: బహుమతులతో విజేతలు



పెద్దేముల్: విజేతలకు జ్ఞాపికలు అందజేస్తున్న ఎంపీపీ అనురాధ

బస్సు సౌకర్యం కల్పించండి

కొడంగల్: గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు, రుద్రారం మాజీ సర్పంచ్ దామోదర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం మాట్లాడుతూ మండలంలోని రుద్రారం, అంగడిరాయిచూర్, పాటిమీదిపల్లి, అన్నారం, నాగారం, టేకుల్‌కోడ్ గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. పాఠశాల సమయంలో విద్యార్థులు బడికి వెళ్లాలంటే ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తుందన్నారు. కోస్గిలో ఆర్టీసీ బస్సు డిపో ఏర్పాటు చేసినా.. ఈ ప్రాంత ప్రజల రవాణా వ్యవస్థ మెరుగు పడలేదన్నారు. రవాణా సౌకర్యం కల్పించాలని పలుమార్లు సంస్థ అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఇప్పటికైనా స్పందించి పై గ్రామాలకు బస్సులు నడపాలని కోరారు.

అతిథి గృహంలో నీటి కొరత

కొడంగల్: పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో నీటి కొరత ఏర్పడింది. అధికారులు, ప్రజా ప్రతినిధులు కొడంగల్‌కు వస్తే ఉండడానికి ఏర్పాటు చేసిన అధికారిక విడిది గృహానికి కల్పించాల్సిన సౌకర్యాల గురించి అధికారులు పట్టించుకోకపోవడంతో నీటి సమస్య తలెత్తింది. ఇక్కడ గతంలో వేసిన బోరు పని చేయడం లేదని, మిషన్ భగీరథ నీరు రావడం లేదని నిర్వాహకులు తెలిపారు. ఎవరైనా వీఐపీలు వస్తే.. కనీసం చేతులు కడుక్కోవడానికి కూడా నీరు లేదని సిబ్బంది చెప్పారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

కొడంగల్: అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ పాండు సర్పంచులకు చెప్పారు. బుధవారం మండలంలో పర్యటించిన ఆయన.. పలు గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి మాట్లాడారు. పల్లె ప్రగతిలో భాగంగా చేపట్టిన వైకుంఠధామాలు, క్రీడా మైదానాల పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. లక్ష్మీపల్లి గ్రామంలో జీపీ కార్యాలయాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

తడి పొడి చెత్తను వేరుగా సేకరించాలి

పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ రవీందర్



మీర్జాపూర్‌లో పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న అధికారులు

పూడూరు: తడి పొడి చెత్తను వేరు చేసి సేకరించాలని పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ రవీందర్ పంచాయతీ అధికారులకు సూచించారు. శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం పెద్ద ఉమ్మెంతాల్, మీర్జాపూర్, చీలాపూర్ గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు, స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ కార్యక్రమం ద్వారా చేపట్టిన ఇంకుడు గుంతలను పరిశీలించి మాట్లాడారు. ఇళ్ల నుంచి వచ్చే మురుగునీరు రోడ్లపై పారకుండా చూడాలని, వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీపీఓ తరుణ్, డీఆర్‌డీఓ కృష్ణన్, డిప్యూటీ సీఈఓ సుభాషిణి, ఎంపీడీఓ ఉమాదేవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడండి

ఇంటి వద్ద ఇంకుడు గుంత నిర్మించుకోవాలి: కౌన్సిలర్



చిన్నారికి పౌష్టికాహారం తినిపిస్తున్న కౌన్సిలర్ సంగీతా ఠాకూర్

తాండూరు టౌన్: వేసవిలో నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉందని, నీటిని పొదుపుగా వాడుకోవాలని 20వ వార్డు కౌన్సిలర్ సంగీతా ఠాకూర్ అన్నారు. బుధవారం గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో చేపట్టిన మిషన్ లైఫ్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె గర్భిణులు, బాలింతలు, పలువురు మహిళలతో మాట్లాడారు. వర్షపు నీటిని నిల్వ చేసి, భూగర్భ జలాల స్థాయిని పెంపొందించేందుకు ఇంటి వద్ద ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని సూచించారు. ఇంటి పెరడులో న్యూట్రి గార్డెన్‌ను ఏర్పాటు చేసుకోవాలని, తులసి, కలబంద, తోటకూర, కూరగాయల వంటివి పండించాలని చెప్పారు. పౌష్టికాహారాన్ని విధిగా తీసుకోవడం వలన శరీరానికి కావాల్సిన ప్రొటీన్లు సమృద్ధిగా లభ్యమవుతాయని తెలిపారు. అనంతరం చిన్నారులకు పౌష్టికాహారాన్ని తినిపించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రాధ, ఏఎన్‌ఎం శాంత, ఆశ వర్కర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోండి

కుల్కచర్ల: ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ రాందాస్ నాయక్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు యాదవ్ అన్నారు. బుధవారం చౌడాపూర్ రైతువేదికలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం వారు మాట్లాడారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని సూచించారు. పీఏసీఎస్ సీఈఓ బక్కారెడ్డి, సర్పంచులు కొత్తరంగారెడ్డి పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న నేతలు

బీసీలను అణచివేస్తున్న సీఎం కేసీఆర్



సమావేశంలో మాట్లాడుతున్న మారుతికిరణ్

నేటి ఓబీసీ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి: బీజేపీ

పరిగి: ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో బీసీలు అణచివేతకు గురవుతున్నారని బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు మారుతికిరణ్ ఆరోపించారు. బుధవారం పట్టణ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. బీసీల హక్కులను సాధించుకునేంత వరకు బీజేపీ పోరాటం చేస్తుందని చెప్పారు. అందులో భాగంగానే ఈనెల 18న నిర్వహించే ఓబీసీ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు యాదయ్య, ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, జిల్లా కార్యదర్శి రమేష్, అనిల్, మైపాల్, కృష్ణ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ అన్నదమ్ముల్లా కలిసి ఉండాలి

తాండూరు రూరల్: ప్రతి ఒక్కరూ అన్నదమ్ముల్లా కలిసి ఉండాలని తాండూరు రూరల్ సీఐ రాంబాబు అన్నారు. బుధవారం సంగెంకలాన్‌లో నిర్వహించిన పోలీస్ కళాజాతలో పోలీస్ చట్టాలు, మూఢనమ్మకాలు, హెల్మెట్, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువకులు మద్యానికి దూరంగా ఉండాలని, చిన్న చిన్న తగాదాలు ఉంటే గ్రామ పెద్దల సంక్షంలో పరిష్కరించుకోవాలని, పోలీస్ స్టేషన్ దాకా రావొద్దని సూచించారు. బాల్య వివాహాలు చేయొద్దని, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపొద్దని చెప్పారు.

◆ దళిత సర్పంచిపై వివక్షత తగదు

బొంరాస్‌పేట: వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవానికి దళిత మహిళా సర్పంచునైన తనకు కనీస సమాచారం ఇవ్వక పోవడం ఎంతవరకు సబబని దుప్చర్ల సర్పంచ్ సుశ్మిత ప్రశ్నించారు. ఈ మేరకు ఆమె బుధవారం మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీ స్థానిక నాయకులు సైతం తనపై వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. కులవివక్ష చూపకుండా అధికారిక కార్యక్రమాలకు ఆహ్వానించాలని, లేని యెడలా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని చెప్పారు.

◆ బాల్యవివాహాలను అరికట్టాలి

దౌల్తాబాద్: బాల్యవివాహాలను అరికట్టేందుకు గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలని ఎంపీపీ విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఎంపీపీ చాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో ఐసీడీఎస్ సీడీపీఓ జయరాం మాట్లాడారు. బాల్యవివాహాలను అరికట్టడానికి ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు.

◆ వెంకన్న సేవలో మాజీమంత్రి



కొండపై కుటుంబ సభ్యులతో మాజీమంత్రి

అనంతగిరి: మాజీమంత్రి ప్రసాద్‌కుమార్ బుధవారం తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. కుమారుడు, కూతురు–అల్లుడితో కలిసి స్వామి వారి సన్నిధిలో సేదతీరారు.

◆ కార్యకర్త కుటుంబానికి బీమా చెక్కు

దోమ: కార్యకర్తలకు బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి అన్నారు. ఊటుపల్లి గ్రామానికి చెందిన నీరటి బండి నరేశ్ గతేడాది విద్యుదాఘాతంతో మృతి చెందగా.. బాధిత కుటుంబానికి పార్టీ సభ్యత్వం ఉండడంతో పార్టీ నుంచి రూ.2 లక్షల బీమా మంజూరయింది. ఈ మేరకు బుధవారం ఆ చెక్కును జెడ్పీటీసీ నాగిరెడ్డి, వైస్ ఎంపీపీ మల్లేశంతో కలిసి నరేశ్ కుటుంబానికి అందజేశారు.

◆ కంటివెలుగును వినియోగించుకోవాలి

పెద్దేముల్: కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కంటివెలుగు క్వాలిటీ కంట్రోలర్ మేనేజర్ డాక్టర్ వసంత అన్నారు. బుధవారం మండలంలో తట్టెపల్లి, పెద్దేముల్ గ్రామాల్లో కొనసాగుతున్న వైద్య శిబిరాలను తనిఖీ చేసి, పలువురికి కళ్లద్దాలు పంపిణీ చేశారు.

దిగుబడి బాగుంది.. పెట్టుబడి పెరిగింది

వరి పండించిన రైతులకు ఏటా ఇబ్బందులు తప్పడం లేదు. దిగుబడి బాగున్నప్పటికీ.. పెట్టుబడి అదే స్థాయిలో పెరిగింది. నాటు మొదలు కోత, విక్రయించే వరకు వారి ఇక్కట్లు అనేకం. మండలంలో వరి పంటకు అనువైన నేలలు, నీటి సౌకర్యం ఉండటంతో సాగుకు మొగ్గు చూపుతున్నారు. కాని గిట్టుబాటు ధరలేక దిగాలు చెందుతున్నారు.

- ఎకరా సాగుకు రూ.25వేల ఖర్చు
- పెరుగుతున్న కూలీల డిమాండ్ ఎరువుల ధరలు
- గిట్టుబాటు లేక దిగాలు
- రూ.3 వేలకు పెంచాలంటున్న రైతులు
- కొనుగోలు కేంద్రాలు పెంచాలంటూ డిమాండ్



గన్నీ బ్యాగులు లేక పంట పొలంలో ధాన్యం రాశులు

పెద్దేముల్: మండల పరిధిలో వరి సాగుకు అన్నదాతలు ఎక్కువ మక్కువ చూపుతున్నారు. జనగాం, రుక్మాపూర్, మంబాపూర్, దుగ్గాపూర్, మన్‌సాన్‌పల్లి, కొండాపూర్, చైతన్యనగర్, గాజీపూర్, బుద్ధారం, పెద్దేముల్, మారేపల్లితండాతో పాటు పలు గ్రామాల్లో సుమారు 2,056 మంది రైతులు 3,567 ఎకరాలల్లో వరి సాగు చేశారు. అందులో 90శాతం దొడ్డు, 10 శాతం సన్న రకం పండించినట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడు సాగు పెరిగిందని, దిగుబడి కూడా బాగుందన్నారు. గతంతో పోలిస్తే పెట్టుబడులు, కూలీల డిమాండ్ పెరిగిందని, ఎకరా పొలంలో వరి సాగుచేస్తే రూ.25వేల వరకు ఖర్చు అవుతుందని, మద్దతు ధర పెరిగితే కాని గిట్టుబాటు కాదన్నట్లు పలువురు రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఇస్తున్న ధర రూ.2,060కి బదులు రూ.3వేలకు పెంచితే బాగుంటుందని చెప్పారు. ఇదిలా ఉండగా.. జనవరి 18వ తేదీ తరువాత పండించిన రైతులకు ఎకరాకు సుమారు 22క్వింటాళ్ల నుంచి 25 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చిందని, జనవరి 4తేది కంటే ముందు సాగు చేసిన వారికి ఎకరాకు 15నుంచి 16 క్వింటాళ్ల దిగుబడి మించలేదని రైతులు పేర్కొన్నారు. దీనికి అధికారుల సలహాలు, సూచనలు లేక, ఇష్టం వచ్చిన సమయంలో సాగుచేయడమే కారణం అన్నట్లు తెలుస్తోంది.

కేంద్రాలు అందుబాటులో లేక...

గతంలో మండలంలో సుమారు పది వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు అందుబాటులో ఉండేవి. ఐకేపీ, పెద్దేముల్ రైతు సేవా సహకార సంఘం, తాండూరు డీసీఎంఎస్ ద్వారా అవి కొనసాగేవి. మూడేళ్ల నుంచి ఐకేపీకి ప్రభుత్వం కమీషన్ ఇవ్వక పోవడంతో వారు ముందుకు రావడం లేదు. పెద్దేముల్ రైతు సేవా సహకార సంఘం రెండేళ్ల నుంచి గిట్టుబాటు కావడం లేదంటూ కొనుగోళ్లు నిలిపివేసింది. చివరకు సిబ్బంది లేరనే సాకుతో తాండూరు డీసీఎంఎస్ మంబాపూర్‌లో కేంద్రాన్ని ప్రారంభించింది. మిగతా జనగాం, మన్‌సాన్‌పల్లి, గాజీపూర్‌లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాక, గోనె సంచులు అందక రైతులు ధాన్యాన్ని రోడ్లపై రాశులు పోసుకొని, తూకం కోసం దీనంగా ఎదురు చూస్తున్నారు. దీనికి తోడు అకాల వర్షం భయం వారిని వెంటాడుతోంది. నాలుగు కేంద్రాలు ప్రారంభిస్తామని చెప్పిన ప్రభుత్వం.. ఒక్కటే ప్రారంభించడంతో తాము ఏం కావాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి మిగతా కేంద్రాలను ప్రారంభించాలని కోరుతున్నారు.

కేంద్రాలు ఏర్పాటు చేయాలి



పంట చేతికి వచ్చిన వెంటనే.. రైతులకు ప్రభుత్వం గోనె సంచులు పంపిణీ చేయాలి. గన్నీ బ్యాగులు లేక ధాన్యాన్ని పంట పొలాల్లో రాశులు పోసుకోవాల్సి వస్తోంది. వర్షం వస్తే దిగుబడి పాడవుతుంది. రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా.. ప్రభుత్వం స్పందించి సకాలంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి.

– శ్రీనివాస్, రైతు, దుగ్గాపూర్

త్వరలో ప్రారంభిస్తాం..



అన్ని గ్రామాల్లో త్వరలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తాం. ప్రస్తుతం మంబాపూర్‌లో కేంద్రం కొనసాగుతుండగా.. మన్‌సాన్‌పల్లిలో ప్రారంభించనున్నారు. జనగాం, గాజీపూర్‌లో త్వరలో ఏర్పాటు చేస్తాం. డీసీఎంఎస్ ద్వారా ధాన్యం కొనుగోలు జరుగుతాయి. రైతులు దిగాలు చెందవద్దు. తేమ సక్రమంగా ఉన్న ప్రతి రైతుకు టోకన్లు ఇస్తాం. ఏఈఓలు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేశాం.

– నజీరొద్దీన్, ఏఓ, పెద్దేముల్